నమస్తే తెలంగాణ



# దగాపడ్డ ప్రాజెక్టులకు..

**ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల కుట్రలకు సమాధానం**

# భరోసా కాళేశ్వరం

## ఉద్యమ ఆకాంక్షల ప్రతిరూపం..తెలంగాణ ప్రగతిరథం

ప్రాజెక్టుల పేరిట కనికట్టుచేసింద్రు!

అసలు వదిలి తోక పనులతో ఊరించింద్రు!

అదిగదిగో ఎత్తిపోతల పథకాలంటూ మభ్యపెట్టింద్రు!

కనీసం దరిదాపున ఉన్న మడి దాహాన్నీ తీర్చలేదు!

వానకాలం దాటితే సాగు, తాగునీటికి గోస తప్పలేదు!

నీళ్లే లేని ప్రాజెక్టుల రూపకల్పన కుట్రలకు అంతులేదు!

మరి ఆ కుట్రలను ఎట్ల ఛేదించాలె?

తలాపు నుంచి తరలిపోతున్న గోదారిని ఎలా ఒడిసిపట్టాలె?

దశాబ్దాల కరువుకు సాక్ష్యంగా నిలిచిన బీళ్లకు ఎట్ల మళ్లించాలె?


ఉత్సవ విగ్రహాలుగా మారిన ప్రాజెక్టుల లక్ష్యాలను ఎలా పరిపూర్ణం చెయ్యాలె?

**అన్ని ప్రశ్నలకూ సమాధానం ఒక్కటే!**

ఉమ్మడి పాలకుల శతకోటి కుతంత్రాలను ఛేదించిన అస్త్రం ఒక్కటే!
అదే కేసీఆర్ మానసపుత్రిక 'కాళేశ్వరం'.. సాంకేతిక అద్భుతం!
తెలంగాణ సర్వ ప్రాజెక్టులకు ప్రాణాధారం!
నవ తెలంగాణ జీవనసూత్రం!..తెలంగాణ ప్రగతి రథం..

- రాష్ట్రానికి గుండెలాంటి హైదరాబాద్‌కు శాశ్వత భరోసా
- గోదావరితో నగరం చెంతన 75 టీఎంసీల జలాశయాలు
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఫలితాలు స్వరాష్ట్రంలో సాకారం
- గతంలో 10 లక్షల ఎకరాలకు కూడా నీళ్లివ్వని ఎస్సారెస్పీ
- కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌తో ఎస్సారెస్పీకి పునర్జీవం
- గోదావరిలో మన వాటా పూర్తి వినియోగానికి అవకాశం
- సింగూరు ప్రాజెక్టుకు మోక్షం.. మానేరు ప్రాజెక్టులకు జీవం
- తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకూ ప్రాణాధారం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : సాగు భూముల విస్తీర్ణం.. పంట ఉత్పత్తుల పెంపులో, వ్యవసాయ అనుబంధరంగాల విస్తరణలో.. పారిశ్రామిక ప్రగతిలో.. రాష్ట్ర తాగునీటి అవసరాలు తీర్చడంలో కాళేశ్వరం ప్రాజెక్టు పాత్ర అనిర్వచనీయం! శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 60 ఏండ్ల చరిత్రను స్వరాష్ట్రంలో తిరగరాసింది. దశాబ్దాలుగా ఒక్క పంటకూ సరిగ్గా నీళ్లివ్వని ఎస్సారెస్పీ ఇప్పుడు రెండు పంటలకు భరోసానిచ్చేలా చేసి ప్రాజెక్టు ప్రతిపాదిత లక్ష్యాన్ని నెరవేర్చింది. చెరువులను నింపి ఊరుమ్మడి బతుకుల కడుపు నింపుతున్నది. అనుబంధ రంగాల విస్తరణకు పాదులు కొల్పుతున్నది. గుక్కెడు నీళ్ల కోసం మంజీరా, గోదావరి, కృష్ణా నదుల వెంట పరుగులు పెట్టిన హైదరాబాద్ నగరవాసుల తండ్లాటకు చరమగీతం పాడింది. భాగ్యనగరికి జలసిరిని చేకూర్చడమే కాకుండా పారిశ్రామిక అవసరాలకు ధీమానిచ్చింది.



## శ్రీరాంసాగర్ లక్ష్యం సాకారం

*ఉమ్మడి ఏపీలో గోదావరిపై నిర్మించిన ఒకే ఒక్క భారీ ప్రాజెక్టు శ్రీరాంసాగర్! ఇది ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అంటూ ఉమ్మడి పాలకులు ఊదరగొట్టినా ఆచరణలో దుఃఖదాయిగానే మిగిలిపోయింది. కేసీఆర్ మాటల్లో చెప్పాలంటే 'చూసుక మురువ.. చెప్పక ఏడ్వ' అన్నట్టు! హైదరాబాద్ స్టేట్‌లో ఈ ప్రాజెక్టును 1953లో ప్రతిపాదిస్తే ఆ తర్వాత దశాబ్దానికి 1963లో శిలా ఫలకం పడింది. 75 శాతం డిపెండబులిటీపై సుమారు 156 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని గత పాలకులు చెప్పారు. 112 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించి, 196 టీఎంసీలను వినియోగించుకునేలా రూపకల్పన చేశారు.*

**1964**లో మొదలైన పనులు 2 దశాబ్దాలపాటు కొనసాగాయి. అంచనా వ్యయం రూ.40 కోట్ల నుంచి రూ.15000 కోట్లకు పెరిగింది కానీ సగం ఆయకట్టుకూ నీళ్లందించలేదు. ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి నీటి విడుదల ప్రారంభించేనాటికే ప్రధాన జలాశయం సామర్థ్యం 12 టీఎంసీలు తగ్గింది. కాల్వలన్నీ పూర్తయ్యేసరికి మరో 10 టీఎంసీల సామర్థ్యం తగ్గింది. గడిచిన పదేండ్లలో ఇప్పుడు మరో 10 టీఎంసీలు తగ్గింది. ప్రస్తుతం ఎస్సారెస్పీ నీటినిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయింది. 32 టీఎంసీల నీటి నిల్వను కోల్పోయింది. ఇక ఎస్సారెస్పీ స్టేజ్-1లో అంటే ఎల్‌ఎండీకి ఎగువన అంటే ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ 0-284 కి.మీ వరకు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. అందులో 1/3 తరి, 2/3 మెట్ట పంటలకు నీరిందించేలా ప్రాజెక్టును డిజైన్ చేసినా ఏనాడూ స్టేజ్-1లో మొత్తం ఆయకట్టులో రెండు వంతుల ఆయకట్టుకు కూడా నీళ్లందిన దాఖలాల్లేవు. ప్రాజెక్టు చరిత్రలో వానకాలం, యాసంగి కలిపినా మొత్తంగా 9 లక్షల ఎకరాలు దాటలేదంటే దాని దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. అప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో దిద్దుబాటుకు ఏవైనా చర్యలు చేపట్టారా? అంటే అదీ లేదు. పైగా మూలుగుతున్న నక్కపై తాటిపండు పడ్డట్టు ఉన్న ఆయకట్టుకే దిక్కులేని ఎస్సారెస్పీని ఆధారంగా చేసుకుని మరిన్ని ప్రాజెక్టులు చేపట్టారు. 1984లో ఎస్సారెస్పీ రెండో దశ అంటే కాకతీయ కాలువను 284 కి.మీ నుంచి 347 కి.మీ వరకు విస్తరణ పనులకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. 4.40 లక్షలకు అదనపు ఆయకట్టును చేర్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండు పర్యాయాలు 1996, 2002లో ఈ పనులకూ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి కూడా పనులు పూర్తికాలేదు. పూర్తయిన కాలువలూ నీళ్లివ్వకుండానే శిథిలావస్థకు చేరాయి. ఎస్సారెస్పీ ఆధారంగానే చౌటుపల్లి హన్మంతరెడ్డి ప్రాజెక్టు నిర్మించారు. కాల్వలు సిద్ధమయ్యే సమయానికి ఎగువన మహారాష్ట్ర బాబ్లీ సహా ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు కట్టడంతో అసలు జలాశయంలోకి వరద రావడమే తగ్గిపోయింది. అడపాదడపా వరద వచ్చినా ప్రాజెక్టు కింద ఉన్న 14 లక్షల ఎకరాల్లో సగం ఆయకట్టుకూ నీరందడం గగనమైంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ తీర్చిదిద్దిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు శాశ్వత భరోసా లభించింది. ప్రాజెక్టు ప్రతిపాదిత లక్ష్యాన్ని నెరవేర్చింది. ఎస్సారెస్పీకి తగినంత వరద రానిరోజుల్లో కాళేశ్వరంలో భాగంగా వరద కాల్వ నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలించే ప్రాణహిత జలాలను పునర్జీవ పథకం ద్వారా వరద కాల్వ నుంచి రివర్స్ పంపింగ్ చేసి శ్రీరాంసాగర్ జలాశయంలో పోసేలా పథకాన్ని రూపొందించారు. వరద కాల్వను 1.5 టీఎంసీల నీటితో 122 కిలోమీటర్ల పొడవునా రిజర్వాయర్‌గా మార్చారు. వరద కాలువను, ఎస్సారెస్పీ కాకతీయ కాలువను అనుసంధానం చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నీటిపంపిణీని ఎల్‌ఎండీ వరకే పరిమితం చేశారు. దిగవ ఆయకట్టుకు వరద కాలువ ద్వారా సప్లిమెంట్ చేశారు. దీంతో శ్రీరాంసాగర్‌పై భారం గణనీయంగా తగ్గింది. ఫలితంగా నేడు ఎస్సారెస్పీ గత లక్ష్యాలను చేరుకోవడమేగాక, కొత్త చరిత్రను లిఖిస్తున్నది. వరదాయిని పేరును సార్థకం చేసుకుంటున్నది.

### ఎస్సారెస్పీ మొదటి దశ ఆయకట్టు 9,68,640

సంవత్సరం వారీగా ఆయకట్టు వివరాలు.. (ఎస్సారెస్పీ స్టేజ్-1)

| సంవత్సరం | వానకాలం | యాసంగి | మొత్తం |
|---|---|---|---|
| 2010-11 | 4,20,000 | 4,43,500 | 8,63,500 |
| 2011-12 | 4,20,232 | 4,59,000 | 8,79,232 |
| 2012-13 | - | 4,50,000 | 4,50,000 |
| 2013-14 | 4,04,657 | 4,80,000 | 8,84,658 |
| 2016-17 | 4,97,072 | 6,14,992 | 11,12,064 |
| 2017-18 | - | 3,47,435 | 3,47,435 |
| 2018-19 | 5,09,768 | 3,33,690 | 8,43,458 |
| 2019-20 | 1,26,881 | 7,97,700 | 9,24,581 |
| 2020-21 | 9,14,374 | 8,34,015 | 17,48,389 |
| 2021-22 | 7,99,163 | 6,83,330 | 14,82,493 |
| 2022-23 | 8,69,630 | 8,32,027 | 17,01,657 |

(నోట్: 2014-15, 2015-16 సంవత్సరాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టుకు నీరివ్వలేదు.)

ఎస్సారెస్పీ స్టేజ్-2 మొత్తం ఆయకట్టు 4,40,000 ఎకరాలు

| సంవత్సరం | వానకాలం | యాసంగి | మొత్తం |
|---|---|---|---|
| 2017-18 | 16,000 | - | 16,600 |
| 2018-19 | 17,000 | - | 17,000 |
| 2019-20 | 6050 | 2.52,000 | 2,58,050 |
| 2020-21 | 3,64,000 | 2,85,000 | 6,90,000 |
| 2021-22 | 3,64,000 | 3,22,000 | 6,86,000 |
| 2022-23 | 3,84,000 | 3,45,096 | 7,29,096 |



## తాగునీటికి తండ్లాడిన భాగ్యనగరం

*వలసపాలకులు హైదరాబాద్ భూములపై చూపిన శ్రద్ధ.. ఇక్కడ మౌలిక వసతులు కల్పించడంపై ఏమాత్రం చూపలేదు. ఇందుకు నాటి హైదరాబాద్ తాగునీటి సరఫరా వ్యవస్థనే నిలువెత్తు నిదర్శనం! నిజాం రాజు నిర్మించిన హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలే తప్ప 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తాగునీటికే అంకితం చేస్తూ నిర్మించిన ఏ ఒక్క జలాశయమూ లేదు. తొలుత 60-70 కిలోమీటర్ల దూరంలో మంజీరాపై నిర్మించిన సింగూరును సాగునీటికి దూరం చేసి హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా వ్యవస్థగా మార్చి రోజుకు 120 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేశారు.*

హైదరాబాద్ నీటి అవసరాలు.. అంచనాలు.. డిమాండ్ (టీఎంసీల్లో)

| | |
|---|---|
| 2022 | 37 |
| 2035 | 47.6 |
| 2050 | 58.98 |
| 2065 | 67.71 |
| 2072 | 70.97 |

కాళేశ్వరంతో హైదరాబాద్‌కు అందుబాటులోకి వచ్చిన రిజర్వాయర్లు

మల్లన్నసాగర్ 50 టీఎంసీలు

కొండపోచమ్మ 15 టీఎంసీలు

65 టీఎంసీలు మొత్తం

అది కంటితుడుపుగా మిగిలిపోవడంతో మళ్లీ 115 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నది నుంచి రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు, అదీ డిమాండ్‌ను తీర్చకపోవడంతో 200 కిలోమీటర్ల దూరంలోని గోదావరి నదినీ ఆశ్రయించారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి పైప్‌లైన్ వేసి రోజుకు 172 మిలియన్ గ్యాలన్ల జలాలను సరఫరా చేయడం మొదలు పెట్టినా అవసరాలు తీరని దుస్థితి! కారణం ఉమ్మడి పాలకులు అనుసరించిన లోపభూయిష్ట విధానాలు! వందల కిలోమీటర్లు పైప్‌లైన్ ద్వారానే నీటిని నిరంతరాయంగా పంపిణీ చేసేలా ప్రాజెక్టులను చేపట్టడం తప్ప ఎక్కడా హైదరాబాద్ నగరానికి సరిపడా తాగునీటి నిల్వకు శాశ్వతంగా రిజర్వాయర్ నిర్మించాలనే ఆలోచనే చేయలేదు. ఫలితంగా ఆయా పైప్‌లైన్లలో ఎక్కడ చిన్న లోపం తలెత్తినా అది సర్దుబాటు అయ్యే వరకు నీటి కొరతను ఎదుర్కోక తప్పని దుస్థితి నెలకొన్నది. 24/7 పైపులైన్లలో నీటి సరఫరా జరిగితేనే తప్ప హైదరాబాద్ మనుగడ లేని పరిస్థితి. వరదలు వచ్చిన సందర్భంలో నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కూడా లేకపోవడంతో ఎండకాలం వచ్చిందంటే జలమండలి కార్యాలయం ముందు ఖాళీ బిందెల ప్రదర్శనలు ఆనవాయితీ మారాయి. కాలనీల్లో ట్యాంకర్ల వద్ద నీటి యుద్ధాలు నిత్యకృత్యమయ్యాయి. ఒక సందర్భంలో విజయవాడ నుంచి రైల్వే వ్యాగన్లలోనూ మంచినీటిని నగరానికి తరలించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి పాలకుల తీరుతో తాగునీటి కోసం హైదరాబాద్ నగరం నదుల వెంట ఉరుకులు పరుగులు పెట్టింది. దీంతో భూగర్భజలాలను పాతాళంలో నుంచి తోడి అవసరాలు తీర్చుకోవడంతో మహా నగరంలో ఎక్కడైనా వెయ్యి ఫీట్ల మేర బోర్లు వేసినా పాతాళ గంగ పైకి రాని దుస్థితి నెలకొన్నది.



దేశంలోని పలు మెట్రో నగరాల్లో తాగునీటి డిమాండ్.. సరఫరా.. లోటు ఇలా..

| నగరం | డిమాండ్ (ఎంజీడీల్లో) | సరఫరా | లోటు |
|---|---|---|---|
| ఢిల్లీ | 1150 | 950 | 200 ఎంజీడీ |
| ముంబయి | 777.59 | 637.91 | 139.68 |
| చెన్నై | 505 | 345 | 160 |
| బెంగుళూరు | 475 | 383 | 92 |
| హైదరాబాద్ | 460 | 468 | ప్లస్8 |

## తాగునీటికి శాశ్వత భరోసానిచ్చిన కాళేశ్వరం

తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్‌లోనే రాష్ట్ర జనాభాలో 33 శాతం మంది ఇక్కడే నివసిస్తున్నారు. భవిష్యత్తులో ఈ జనాభా మరింత పెరగనున్నది. రాష్ట్ర ఆదాయంలో దాదాపు 60 శాతం మేర వనరులకు ఇదే కేంద్ర బిందువు. అంతటి ప్రాధాన్యత ఉన్న హైదరాబాద్ మహానగరం నీటి కోసం పరుగులు తీయకుండా ఉండాలంటే పుష్కలమైన నీటి వసతి అత్యవసరం! దానికి శాశ్వత భరోసా కల్పించింది కేసీఆర్ తీర్చిదిద్దిన కాళేశ్వరం! భాగ్యనగరికి జలసిరిని అందించబోతున్నదీ ఇదే ప్రాజెక్టు! కాళేశ్వరం ద్వారా ఏకంగా హైదరాబాద్ చెంతనే నగర జనాభా నీటి అవసరాల కోసం 65 టీఎంసీల స్టోరేజీ అందుబాటులోకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్ నగరానికి చెంతనే కొలువైంది. మల్లన్నసాగర్‌లో మరో 50 టీఎంసీలు, మొత్తంగా ఒక్క గోదావరి నుంచే 65 టీఎంసీల నీటి లభ్యత నిత్యం నగరానికి అందుబాటులోకి వచ్చింది. అదీగాక కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లి, సింగూరు ప్రాజెక్టుల్లోనూ నీటి కొరత తీరిపోనున్నది. ఎగువ నుంచి నీళ్లు రాకున్నా దిగువ నుంచి ఎత్తిపోతల ద్వారా ఆయా ప్రాజెక్టులను నింపేలా కాళేశ్వరానికి కేసీఆర్ రూపకల్పన చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్ జనాభా ఎంత పెరిగినా ఆయా ప్రాజెక్టుల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీటి అవసరాలు తీర్చుకునే అవకాశం ఏర్పడింది. మరోవైపు కృష్ణా నది నుంచి 16.6 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటికి వినియోగించాల్సి ఉంది. అయితే నాగార్జునసాగర్‌లో 510 అడుగులకు ఎగువన నీరుంటేనే ఆ మొత్తం వినియోగించుకునే పరిస్థితి ఉండేది. అలా నాటి పంపింగ్ స్టేషన్లను ఉమ్మడి పాలకులు ఏర్పాటు చేశారు. ఆ సమస్యకు సైతం సుంకేశుల ప్రాజెక్టు ద్వారా పరిష్కారం లభించింది. సాగర్‌లో మరింత దిగువకు 462 అడుగుల వద్ద పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఫలితంగా సాగర్‌లో ఎంత మేరకు నీళ్లు ఉన్నా హైదరాబాద్‌కు నీటి సరఫరా చేసుకోవచ్చు. మొత్తంగా 2072 నాటికి పెరగనున్న నగర జనాభా తాగునీటి అవసరాలకు అనుగుణంగా గత బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పాట్లు చేసింది. దేశంలోని ఏ మెట్రో నగరాలను చూసినా హైదరాబాద్‌కు ఉన్నంత పుష్కలమైన నీటి వసతి మరో నగరానికి లేదు.

మెట్రో పట్టణాల దుస్థితి

| మెట్రో పట్టణం | తాగునీటి వనరు | దూరం | అందుబాటులో నీళ్లు (టీఎంసీల్లో) |
|---|---|---|---|
| ఢిల్లీ | అప్పర్‌యమున, గంగా | 320కిమీ | - |
| ముంబాయి | మిడిల్ వైతర్నా | 120 | 68.74 టీఎంసీలు |
| చెన్నై | కృష్ణా, కావేరి | 200 | 44 టీఎంసీలు |
| బెంగుళూరు | కావేరి, అర్కావతి | 100 | 28 టీఎంసీలు |
| హైదరాబాద్ | కృష్ణా, గోదావరి | 100 | 16.5+65 టీఎంసీలు |

## పాత ప్రాజెక్టులన్నింటికీ ప్రాణాధారం కాళేశ్వరం

*గోదావరి నది మొత్తం పొడవు 1465 కిలోమీటర్లు.. తెలంగాణలో 765 కి.మీ. ఈ ప్రస్థానంలో గోదావరికి ఊపిరిపోసే కీలకమైన ఉపనదులు అనేకం ఉన్నాయి. గోదావరి నది రికార్డులను తిరగేస్తే ఏటా 3-4 వేల టీఎంసీల జలాలు సముద్రంలో కలుస్తున్నాయనేది నగ్న సత్యం. అందులోనూ ప్రాణహిత భాగస్వామ్యమే సరాసరి 36 శాతం! అంటే 1000-1400 టీఎంసీలు అన్నమాట! ఇంద్రావతి కలిస్తే ఇది 2000-2500 టీఎంసీల వరకు ఉంటుంది.*

ఆ రెండు ప్రధాన ఉపనదులు తెలంగాణ పరిధిలోనే ప్రధాన గోదావరిలో కలుస్తాయి. పెద్దపెద్ద ఇంజినీర్లు అవసరం లేదు. చిన్న పిల్లాన్ని అడిగినా ఆ రెండు ప్రధాన ఉపనదులు కలిసిన తర్వాత ప్రాజెక్టులు నిర్మిస్తే తెలంగాణ బీడు భూములను గోదారమ్మ పావనం చేస్తుందనే సత్యాన్ని చెప్తాడు. కానీ ఆరు దశాబ్దాలుగా జరిగిన తతంగం అందుకు భిన్నం! ఏలికలెవరైనా ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన వ్యూహం ఒక్కటే! ఎక్కడా చిన్న ఆటంకం లేకుండా, ఒక చుక్క గోదావరి కూడా తెలంగాణ గడ్డ మీద నిలబడకుండా ధవళేశ్వరం దాకా పరుగులు తీయాలనే కుతంత్రం ఇందులో దాగి ఉన్నది. ఉమ్మడి ఏపీ ఏర్పడేనాటికి ఒప్పందాలు పూర్తయి అంతర్రాష్ట్ర సమస్యలు కూడా పెద్దగా లేని తెలంగాణ చారిత్రక ప్రాజెక్టుల గొంతు నులిమారు. 350 టీఎంసీల వినియోగానికి రూపకల్పన చేసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 112 టీఎంసీలకు కుదించి ఎందుకూ కొరగాకుండా చేశారు. 300 టీఎంసీల వినియోగానికి ప్రతిపాదించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు, దానికి అదనంగా 100 టీఎంసీలతో ప్రతిపాదించిన కాంతనపల్లి ప్రాజెక్టుకు పాతరేశారు. పుష్కలంగా నీటి లభ్యత ఉన్న ప్రాణహిత, ఇంద్రావతి బేసిన్‌లను వదిలి నీరు లభించని ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించారు. ఉమ్మడి పాలకులు గోదావరిపై రూపొందించిన తెలంగాణ ప్రాజెక్టులన్నీ అప్పర్ గోదావరి (జీ1), (జీ2), ప్రవర (జీ3), మంజీరా (జీ4), మధ్యగోదావరి (జీ5), మానేరు (జీ6)పై ఆధారం చేసుకున్నవే కావడం అందుకు నిదర్శనం. ఎగువ నుంచి వరద తక్కువైందని తెలిసినా శ్రీరాంసాగర్‌ను ఆధారం చేసుకొని వరద కాల్వ.. దాని దిగువన ప్రధాన గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు, కడెంపై మరో ప్రాజెక్టు.. గుత్ప, అలీసాగర్ వంటి ప్రాజెక్టులు, నీరులేని గోదావరి ఉపనది మానేరుపై మధ్యమానేరు, దిగువ మానేరు ప్రాజెక్టులు నిర్మించారు. అవన్నీ ఒకెత్తయితే మంజీరాపై అప్పటికే ఉన్న నిజాంసాగర్‌కు నిలువునా ఉరేసినట్టుగా సింగూరు ప్రాజెక్టు, పైగా దాన్ని హైదరాబాద్ తాగునీటి కోసమే కేటాయించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సుదీర్ఘ కాలయాపన, ఎగువ రాష్ట్రాలు ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు నిర్మించడం, మన వద్ద నీటినిల్వ సామర్థ్యం పడిపోవడం వెరసి వేలకోట్లు వెచ్చించి నిర్మించిన ఆయా ప్రాజెక్టులతో తెలంగాణకు దక్కిన ఫలితం శూన్యం! అయినా కాగితాలపైనే ఆయకట్టును చూపుతూ ఏళ్లుగా తెలంగాణను కనికట్టు చేస్తూ కట్టిపడేశారు.

వాటి పూడికతీయలేం. తీద్దామన్నా వేల కోట్ల ఖర్చు! ఇక కొత్తగా ఆ స్థాయిలో ప్రాజెక్టులు నిర్మించడమూ అసాధ్యం. కారణం ఇప్పుడు అన్ని రాష్ట్రాల వినియోగం పెరగడంతో పాటు అవగాహన, అవసరాలు పెరిగి ప్రాజెక్టులూ పెరిగాయి. పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు పెరిగాయి. దానికి తోడు జనావాసాలు పెరిగి ముంపు అనేది కూడా పెద్ద సమస్యగా మారింది. ఇలా ఉమ్మడి పాలకులు సృష్టించిన శతకోటి సమస్యలకు పరిష్కారంగా కేసీఆర్ ఆవిష్కరించిన అద్భుతమే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం! అన్ని పాత ప్రాజెక్టుల ఆయకట్టుకు భరోసానివ్వడమేగాక కొత్త ఆయకట్టుకు పురుడుపోసింది. ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే గోదావరిలో మన 968 టీఎంసీల్లో 750 టీఎంసీలకు పైగా వినియోగించుకునే మార్గం సుగమమైంది. ఎగువ నుంచి వరద వచ్చినా, రాకున్నా ఎల్లంపల్లికి ఢోకా లేకుండా పోయింది. దైవాదీనంగా మానేరుపై నిర్మించిన ఎగువ, మధ్య, దిగువ మానేరుకు కాళేశ్వర గంగ శాశ్వత భరోసా కల్పించింది. మంజీరా మొహం చాటేసినా, సింగూరుకు కాళేశ్వరం ఊపిరిలూదింది. ఆయకట్టుకు మోక్షం లభించింది. అదే రీతిన హల్దీ వాగుద్వారా చారిత్రక నిజాంసాగర్‌కు ప్రాణహిత జలాలతో ప్రాణం పోస్తున్నది. అందుకు నేడు గత ప్రాజెక్టుల కింద సాగవుతున్న ఆయకట్టు, వస్తున్న పంటల ఉత్పత్తే సజీవ సాక్ష్యమైంది. అందుకే కాళేశ్వరం తెలంగాణ జీవనరేఖలా నిలిచింది!



### కాళేశ్వరం కింద ఉన్న కొత్త ఆయకట్టు

| లింక్ | ఆయకట్టు |
|---|---|
| 1) మేడిగడ్డ-ఎల్లంపల్లి | 30,000 |
| 2) ఎల్లంపల్లి-మిడ్‌మానేరు | - |
| 3) మిడ్‌మానేరు-ఎగువమానేరు | 86150 ఎకరాలు |
| 4) మిడ్‌మానేరు-మల్లన్నసాగర్ | 5,95,754 |
| 5) మల్లన్నసాగర్- చిట్యాల | - |
| 6) మల్లన్నసాగర్- సింగూరు | 2,80,290 |
| 7) ఎస్సారెస్పీ- భూంపల్లి | 5,90,000 |
| మొత్తం | 18,25,700 ఎకరాలు (141టీఎంసీలు) |

(నోట్: సింగూరు కింద కొత్తగా చేర్చిన సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టుల కింద 3.90 లక్షల ఎకరాలు )

### కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నింపగలిగే జలాశయాలు.. ఆయకట్టు

| ప్రాజెక్టు | ఆయకట్టు | టీఎంసీలు |
|---|---|---|
| ఎస్సారెస్పీ1, 2 | 13,66,000 | 90.31 |
| ఎల్లంపల్లి | 1,51,000 | 20.17 |
| సింగూరు | 40,000 | 30 |
| వరదకాలువ | 1,00.000 | 02 |
| నిజాంసాగర్ | 2,31,000 | 17 |
| కడెం | 68,000 | 07.63 |
| మిడ్‌మానేరు | 2.20,000 | 25.87 |
| చెరువులు, చెక్‌డ్యామ్‌లు | 5,00,000 | 65 |
| మొత్తం | 26,76,000 | 257.98 |

### గోదావరి నది బేసిన్ల వారీగా నీటి లభ్యత శాతాల్లో..

| | |
|---|---|
| జీ1 (అప్పర్ గోదావరి) | 7.90 |
| జీ2 (ప్రవర) | 1.10 |
| జీ3 (పూర్ణ) | 1.89 |
| జీ4 (మంజీర) | 4.3 |
| జీ5 (మధ్య గోదావరి) | 5.90 |
| జీ6 (మానేరు) | 1.38 |
| జీ7 (పెన్‌గంగ) | 4.21 |
| జీ8 (వార్ధా) | 5.27 |
| జీ9 (ప్రాణహిత) | 25.96 |
| జీ10 (లోయర్ గోదావరి) | 7.19 |
| జీ11 (ఇంద్రావతి) | 22.93 |
| జీ12 (శబరి) | 12.24 |